

**ఖైరతాబాద్ కవాతు..** శుక్రవారం రాత్రి ఖైరతాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు. సభకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

# నరహంతక కాంగ్రెస్‌ను క్షమిద్దామా?

## వందల మంది మన బిడ్డలను పొట్టనబెట్టుకున్నరు

## 1956లో ఉన్న తెలంగాణను ఊడగొట్టిందే కాంగ్రెస్

**ఇక్కడి కాంగ్రెస్, బీజేపోళ్లు రాహుల్, మోదీ చేతిలో కీలుబొమ్మలు**

- మన ప్రజల ఆశలను తుంగలో తొక్కిందే ఇందిరమ్మ
- ఢిల్లీ పార్టీలకు ఓటేస్తే మన సింగరేణిని మింగేస్తరు
- పొరపాటున వారికి అధికారమిస్తే హైదరాబాద్ ఆగమే
- ప్రగతి కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలి
- ప్రచారంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో/ మంచిర్యాల, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉద్యమంలో వందల మంది మన బిడ్డలను పొట్టనబెట్టుకున్న హంతక, నరహంతక కాంగ్రెస్‌ను క్షమిద్దామా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు ప్రశ్నించారు. 1956లో ఉన్న తెలంగాణను ఊడగొట్టిందే కాంగ్రెస్ అని, తెలంగాణకు, ఆంధ్రకు ఇష్టం లేని లగ్గం చేసింది ఢిల్లీ దొర రాహుల్ ముత్తాత నెహ్రూ అని విమర్శించారు. 14 ఏండ్లు కొట్లాడి, రాష్ర్టాన్ని తెచ్చిన పార్టీ మనదైతే.. 58 ఏండ్లు చావకొట్టింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. ఆ దిక్కుమాలిన దరిద్రం కాంగ్రెస్‌ను మళ్లా తెచ్చుకుందామా? దరిద్రానికి నేస్తమైన హస్తాన్ని నెత్తిన పెట్టుకుందామా? ఆలోచించాలని పిలుపునిచ్చారు. మేమే వందల మంది తెలంగాణ పోలగాండ్లను చంపినమని కాంగ్రెస్ నేత చిదంబరం ఇప్పుడు సారీ చెప్తున్నడని, ఈ దిక్కుమాలిన పార్టీని క్షమిద్దామా? ఆలోచించాలని కోరారు. శుక్రవారం జూబ్లీహిల్స్,ఖైరతాబాద్, మంచిర్యాల నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు మాగంటి గోపీనాథ్, దానం నాగేందర్, దివాకర్‌రావుకు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలు, ఖానాపూర్ నియోజకవర్గం జన్నారంలో అభ్యర్థి జాన్సన్‌నాయక్‌కు మద్దతుగా నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెసోళ్లకు, బీజేపోళ్లకు టికెట్లు ఏడిస్తరు? బీఫామ్‌లు ఏడిస్తరు? వాళ్లకు పంచాయితీలైతే ఏడికిపోవాలే? రేపు ఏదైనా కొత్తవిధానం తీసుకురావాలంటే ఏడికిపోవాలే? బాత్‌రూమ్‌కు పోవాలంటే ఎవర్ని అడగాలే? ప్రశ్నిస్తే.. ఢిల్లీకి పోవాలే, ఢిల్లీ పెద్దలను అడగాలనే సమాధానాలు జనం నుంచి వచ్చాయి. దీనికి కేటీఆర్ మరి గిసొంటి సన్నాసులు మనకు అవసరమా? ఒక్కసారి ఆలోచన చేయాలె. రేపు సింగరేణిని ప్రైవేటీకరణ చేయాలని కాంగ్రెసోళ్లు, బీజేపోళ్లు అనుకుంటే ఆపడం ఇక్కడున్న సిపాయిలతో అవుతుందా? అని ప్రశ్నించారు.

### కేసీఆర్ కమిట్‌మెంట్ రాహుల్, మోదీకి ఉంటదా?

చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌కు ఉండే కమిట్‌మెంట్ రాహుల్, మోదీకి ఎందుకు ఉంటుందని మంత్రి కేటీఆర్ అన్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్ల చేతుల్లో, ఓటుకు నోటు కేసులో దొంగల చేతుల్లో రాష్ర్టాన్ని పెడితే ఆగం కాకుండా ఉంటుందా? అని ప్రశ్నించారు. 24 గంటల కరెంట్ కావాల్నా.. కాంగ్రెస్ కావాల్నా? ప్రజలే నిర్ణయించుకోవాలని సూచించారు. మనందరం శివరాత్రికే జాగారం చేస్తాం కానీ, కాంగ్రెస్ హయాంలో రైతులు ప్రతి రాత్రి జాగారమే చేసేటోళ్లు అని గుర్తుచేశారు. ఇవాళ రేవంత్.. తెలంగాణలో ఉండే బీద, బిక్క రైతుల ముఖాలకు 24 గంటల కరెంట్ ఎందుకు? 3 గంటలు చాలు.. 10 హెచ్‌పీ మోటర్ పెడితే 3 ఎకరాలు పారుతది అని చెప్తున్నడని, ఇవి వ్యవసాయం మీద సోయి ఉన్నోడు మాట్లాడే మాటలేనా? ఆలోచించాలని కోరారు. అందుకే నేను ఒక్కటే అడుగుతున్నా.. కరెంట్ కావాల్నా.. కాంగ్రెస్ కావాల్నా.. ఆలోచించుకోవాలని సూచించారు.

> కరెంట్ గురించి మాట్లాడేందుకు కాంగ్రెసోళ్లకు సిగ్గు ఉండాలి. సీఎం కేసీఆర్ 24 గంటలు ఇస్తుంటే రేవంత్ కనపడత లేదంటా. నాకు తెల్వక అడుగుతా.. ఎక్కడన్న కరెంట్ కనపడతదా? రేవంత్ మంచిర్యాల లేదా ఖానాపూర్‌లో ఏ గల్లీకైన పోయి వైర్లను పట్టుకుంటే కరెంట్ ఉందో లేదో తెలిసిపోవడంతోపాటు రాష్ర్టానికి దరిద్రం కూడా పోతది.
> - మంత్రి కేటీఆర్

### కులం కుంపటి లేదు.. మతం మంటలు లేవు..

కేసీఆర్ ప్రభుత్వ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కులం కుంపట్లు, మతం మంటలు లేవని.. ప్రాంతం పేరుతో పంచాయతీ పెట్టలేదని, హైదరాబాద్ నగరం చాలా ప్రశాంతంగా ఉన్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఉన్నోళ్లంతా మా వారే, మా బిడ్డలే అని చూసుకున్నామని స్పష్టంచేశారు. బీఆర్‌ఎస్ పాలనలో కరెంట్ కష్టాలు లేవని, కంపెనీలు వచ్చి సంపద పెరుగుతున్నదని, ఉపాధి దొరుకుతుందని స్పష్టంచేశారు. దేశంలోని లక్షల మందికి అమ్మలా అన్నం పెడుతున్న హైదరాబాద్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అంటేనే కల్లోలం అని, ఒక్క సీఎంను దించడానికి పాతబస్తీలో మతకల్లోలాలు లేపి 400 మంది ప్రాణాలు తీసుకున్న చరిత్ర ఆ పార్టీది అని ధ్వజమెత్తారు. వారికి ప్రజలపై ఆరాటం ఉండదని, కుర్చీల కోసం ఒకరి కాలు ఒకరూ లాక్కునేందుకు సమయం సరిపోతుందని చెప్పారు. 11 సార్లు అవకాశం ఇస్తే ఏం చేయని కాంగ్రెసోళ్లు.. ఇప్పుడు ఒక్క ఛాన్స్ అంటూ వస్తున్నారని? అన్నారు. పొరపాటున తప్పు చేస్తే ఆ పాత చీకటి రోజులు తిరిగి వస్తాయని, మళ్లీ కరెంట్ కోతలు, కంపెనీల మూతలు, ఛార్జీల మోతలు తయారైతది కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ వస్తే హైదరాబాద్ ప్రగతి కుక్కలు చింపిన విస్తరే అవుతుందని అన్నారు. కాంగ్రెస్ వస్తే అస్థిర పాలన వస్తోందని, పెట్టుబడులు ఆగిపోతాయన్నారు.

> ఇవాళ ఒక్క కేసీఆర్‌ను కొట్టేందుకు దేశంలోని సిపాయిలందరూ దిగుతున్నారు. మోదీ, అమిత్‌షా, యోగీ ఆయన వెనుకో బోగీ.. అందులో ఓ 15 మంది ముఖ్యమంత్రులు, 15 మంది కేంద్ర మంత్రులు ఇలా చాలా మంది గొప్పగొప్పోళ్లు ఒక దిక్కు దిగుతున్నారు. ఇంకో దిక్కు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, డీకే శివకుమార్ ఇంకా పెద్దపెద్ద షేర్లు, శంషేర్లు, బబ్బర్‌ఖాన్‌లు, తీస్మార్‌ఖాన్‌లు దిగుతున్నారు. సింహం ఎప్పుడూ సింగిల్‌గానే వస్తుందని, కేసీఆర్ సింహంలాంటోడు కాబట్టే సింగిల్‌గానే వస్తున్నడు. గుంపులుగా ఏం వస్తాయో మీకే తెలుసు.
> - మంత్రి కేటీఆర్


### కాంగ్రెస్‌లో 11 మంది సీఎంలు

కాంగ్రెస్‌లో ఏ ఒక్క నాయకుడికైనా సీఎం కేసీఆర్ లాంటి విజన్ ఉన్నదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆ పార్టీలో ఇప్పుడే 11 మంది సీఎంలు ఉన్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ కలకత్తాకు వెళ్లి మమతబెనర్జీ బీజేపీకి బీటీం అని, ఢిల్లీకి వచ్చి కేజ్రీవాల్ బీజేపీకి బీటీం, తెలంగాణకు వచ్చి బీఆర్‌ఎస్ బీటీం అంటున్నారని.. బీఆర్‌ఎస్ ప్రజలకు మాత్రమే బీటీం అని స్పష్టంచేశారు. బీజేపీకి ఇక్కడ డిపాజిట్ కూడా రాదని అన్నారు. కేసులతో బెదిరిస్తే భయపడేది లేదని, ఢిల్లీ వాళ్లకు మెడలు వంచేది లేదని, భవిష్యత్తులో ప్రజల ఆశీర్వాదం ఉంటే ఢిల్లీలో కూడా గులాబీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు ఒరిగేదేమి లేదని, వారిని ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో 1,250 కోట్లను మైనార్టీల అభ్యున్నతికి ఖర్చు చేశామని స్పష్టంచేశారు. విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌ను చూసి ప్రముఖులు మురిసిపోతున్నారని, ఇక్కడి దరిద్రులకు నచ్చడం లేదని అన్నారు. అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరి ఖాతాలో 15 లక్షలు వేస్తామన్న మోదీ.. ఇప్పుడు ఆ ముచ్చటే మరిచిపోయారన్నారు.

### వచ్చే టర్మ్‌లో 24 గంటల తాగునీరు

హైదరాబాద్‌లో వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, వచ్చే టర్మ్‌లో 24 గంటల తాగునీరిస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. డ్రైనేజీ, చెరువులను బాగు పర్చుకుందామని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్క మహిళకు సౌభాగ్య లక్ష్మి పేరిట ప్రతి నెల రూ.3 వేలు, ఆసరా పెన్షన్లు పెరుగుతాయని, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి అన్నపూర్ణ పథకం ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని వెల్లడించారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి కేసీఆర్ బీమా.. ఇంటింటికి ధీమా కార్యక్రమం ద్వారా రూ. 5లక్షల జీవితబీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. మోదీ పాలనలో రూ.400 సిలిండర్ రూ.1,200కు చేరిందని.. డిసెంబర్ 3 తర్వాత పెంచిన రూ.800లను కేసీఆర్ ప్రభుత్వమే భరించి ఆడబిడ్డలకు రూ.400లకే సిలిండర్లు అందజేస్తుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్ విశ్వనగరం కావాలన్నా, మరిన్ని వసతులు కల్పించాలన్నా స్థిరమైన ప్రభుత్వం, దృఢమైన నాయకత్వాన్ని ప్రోత్సహించాలని కోరారు. అలకలు, అసంతృప్తులు ఎక్కడైనా ఉంటాయనీ, అలిగిన, గులిగిన ఓటు గుద్దుడు మాత్రం బీఆర్‌ఎస్‌కే ఉండాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని, మంచిర్యాల, ఖానాపూర్, చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థులు దివాకర్‌రావు, జాన్సన్‌నాయక్, బాల్క సుమన్, జూబ్లీహిల్స్ ఎన్నికల ఇంఛార్జి కట్టెల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ నేత పీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి కోలేటి దామోదర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## లోకం పోకడ




'ఎలక్షన్ టాక్స్' కింద ఎక్స్‌ట్రా డబ్బులు ఎక్కడయ్యా? పొరుగు రాష్ట్రాల్లోని మా పార్టీకి పంపాలి!

## ముఖ్యమంత్రి కేసీఆర్ సభలో బుల్లెట్లతో దొరికిన వ్యక్తి అరెస్టు

నర్సాపూర్, నవంబర్ 17: సీఎం కేసీఆర్ పాల్గొన్న నర్సాపూర్ సభలో తుపాకీ బుల్లెట్లతో దొరికిన నిందితుడు అస్లాంపై అరెస్ట్ చేసి, జైలుకు తరలించినట్టు నర్సాపూర్ ఎస్సై శివకుమార్ శుక్రవారం తెలిపారు. అతని వద్ద నుంచి రెండు తుపాకీ బుల్లెట్లను స్వాధీనం చేసుకొన్నట్టు చెప్పారు. నిందితుడి స్వగ్రామం సంగారెడ్డి జిల్లా రాయికోడ్ కాగా, ప్రస్తుతం మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం చండూర్‌లో బంధువుల వద్ద ఉంటూ చికెన్ షాప్‌లో పనిచేస్తున్నాడని తెలిపారు. అస్లాం 2016లో జోగిపేటలో డిగ్రీ చదువుతున్నప్పుడు ఎన్‌సీసీ విభాగంలో ఖాసీపూర్‌లో శిక్షణ పొందాడని, అప్పుడు అక్కడి ఓ గదిలో ఉన్న రెండు తుపాకీ బుల్లెట్లను వెంట తెచ్చుకున్నట్టు తెలిపారు. వాటిని జేబులో పెట్టుకొని సభకు రాగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 38.1°c | 14.9°c |
| నల్లగొండ | 35.6°c | 19.2°c |
| రంగారెడ్డి | 34.6°c | 13.9°c |
| మెదక్ | 33.4°c | 13.7°c |
| ఖమ్మం | 33.0°c | 22.0°c |
| వరంగల్ | 32.0°c | 20.0°c |
| కరీంనగర్ | 32.0°c | 19.0°c |
| హైదరాబాద్ | 31.6°c | 18.0°c |
| నిజామాబాద్ | 31.2 °c | 18.9°c |
| మహబూబ్‌నగర్ | 30.8°c | 20.4°c |

## 20 కల్లా బ్యాలట్ పత్రాల ముద్రణ పూర్తి

- కొత్తగా 299 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- డిప్యూటీ సీఈవో సత్యవాణి వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బ్యాలట్ పేపర్ల ముద్రణ ప్రారంభమైందని, ఈ నెల 18 కల్లా పోస్టల్ బ్యాలట్, 20వ తేదీ కల్లా ఈవీఎంల బ్యాలట్ పేపర్ల ముద్రణ పూర్తిచేయనున్నట్టు రాష్ట్ర ఎన్నికల డిప్యూటీ సీఈవో సత్యవాణి తెలిపారు. చంచల్‌గూడలోని ప్రభుత్వ ముద్రణాలయంలో వీటిని ముద్రిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అదనంగా మరో 299 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. బీఆర్‌కేఆర్ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో సత్యవాణి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల బరిలో 2,290 మంది అభ్యర్థులు ఉన్నారని చెప్పారు. పెరిగిన ఓటర్లు, దూర ప్రాంతాల్లో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వల్ల కొత్తగా 299 బూత్‌ల ఏర్పాటుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిందని చెప్పారు. కొత్త వాటితో కలిపి రాష్ట్రంలో మొత్తం 35,655 పోలింగ్ కేంద్రాలుంటాయని తెలిపారు. ఇంటి వద్ద ఓటింగ్ వేసే తేదీలను ఖరారు చేసే అధికారం ఆయా రిటర్నింగ్ అధికారులకే ఉంటుందని చెప్పారు. ఆ తేదీలను అభ్యర్థులకు, ఓటర్లకు తెలుపుతారని వివరించారు. ఇంటివద్ద ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారు పోలింగ్ బూత్‌లో ఓటు వేసే అవకాశం లేదని అన్నారు.

### ఎన్నికలపై నిఘాకు సమీకృత నియంత్రణ వ్యవస్థ

రాష్ట్రంలో ఎన్నికలను స్వేచ్ఛగా, సక్రమంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం సమీకృత నియంత్రణ వ్యవస్థ-ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసింది. ఎన్నికల నేపథ్యంలో జరిగే హింస, దౌర్జన్యం, కుల, మత రాజకీయాలు, పోలింగ్ కేంద్రాల ఆక్రమణ, తప్పుడు సమాచారం, సైబర్ నేరాలు, విద్వేష ప్రసంగాలు, ప్రలోభాల వంటి సమస్యలపై ఈ కేంద్రం నుంచి దృష్టి సారించనున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను, పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుని సరైన నిర్ణయాలతో స్పందించడానికి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయంలో ఈ కేంద్రాన్ని నెలకొల్పారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ కేంద్రం 24 గంటల పాటు నిరంతరం పనిచేస్తుంది. తనిఖీలు, స్వాధీనాలు, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, 1950 కాల్ సెంటర్‌కు అందిన ఫిర్యాదులు, అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద తనిఖీలు, ప్రకటనలతో సహా ప్రచార, ప్రసారాల్లో జరిగే ఉల్లంఘనలు, నిఘా బృందాల సమన్వయం, సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులు, సువిధ తదితర అంశాలను ఈ కేంద్రం ద్వారా పర్యవేక్షించనున్నారు. ప్రతిరోజు 15 శాటిలైట్ టీవీలు, మూడు యూట్యూబ్ చానళ్లను పరిశీలించే ఏర్పాటు కూడా చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లోని కంట్రోల్ రూంలను దీని పరిధిలోకి తెచ్చారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన బాలకిషన్ యాదవ్‌తో మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

## బీఆర్‌ఎస్‌లో చేరిన బాలకిషన్ యాదవ్

- పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): కొడంగల్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి, ఆ తర్వాత ఉపసంహరించుకొన్న బాలకిషన్ యాదవ్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం మంత్రి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బాలకిషన్ యాదవ్‌కు మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, కొడంగల్ ప్రజల శ్రేయస్సు కోసం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి నిరంతరం పాటుపడుతుండటం చూసి తాను నామినేషన్‌ను ఉపసంహరించుకొన్నట్టు చెప్పారు. ఇకనుంచి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి పట్నం నరేందర్ రెడ్డి విజయం కోసం శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. దుద్యాల మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి ప్రచారం చేసిన రోజు బాలకిషన్ యాదవ్ బీఆర్‌ఎస్‌లో చేరడం చర్చనీయాంశమైంది.

## ఓట్ల కోసమే చిదంబరం చిలుక పలుకులు

- ఓయూ జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్



ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 17: ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే చిదంబరం చిలుక పలుకులు పలుకుతున్నారని ఓయూ జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్ మండిపడ్డారు. కాంగ్రెస్ తీరుతో సిగ్గుపడుతున్నామని చెప్పారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మలిదశ ఉద్యమంలో దాదాపు 1,200 మంది అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 'తెలంగాణ రాష్ట్ర ప్రకటనను వెనక్కి తీసుకున్నందుకు మమ్మల్ని క్షమించండి' అంటూ చిదంబరం చెప్పడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధిని ఓర్వలేకనే అధికారం దాహంతో కుట్రలు పన్నుతున్నారని విరుచుకుపడ్డారు. కేంద్రంలో ఉన్న జాతీయ పార్టీలకు తెలంగాణలో అడ్రస్ లేకుండా చేయడమే తమ లక్ష్యమని స్పష్టంచేశారు. ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి బీఆర్‌ఎస్‌ని గెలిపించాలని కోరారు.

## కాంగ్రెస్ ద్రోహానికి క్షమాభిక్ష లేదు

- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పదే పదే అవమానించడంపై ప్రజల ఆగ్రహం
- కాంగ్రెస్‌ను తెలంగాణ క్షమించదు: కేటీఆర్
- డయ్యర్ సారీ చెప్పినట్టే ఉన్నది: హరీశ్
- గాంధీలు క్షమాపణలు చెప్పలేరా?: కవిత
- 'కాంగ్రెస్ మర్డరర్స్' హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్



హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని, ఆత్మ బలిదానాలను అవమానించిన కాంగ్రెస్‌పై తెలంగాణ సమాజం భగ్గుమన్నది. తెలంగాణ అమరుల త్యాగాలను పూచికపుల్లలా తీసిపడేసేలా వ్యాఖ్యానించిన కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఆత్మహత్య అనేది దురదృష్టకర ఘటన. ప్రజా ఉద్యమంలో కొందరు ప్రాణాలు కోల్పోయారు. అందుకు సారీ' అన్న చిదంబరం వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ప్రజానీకం ఫైర్ అయింది. 'కాంగ్రెస్ కృరత్వాలను రాష్ట్రం క్షమించదు, మరిచిపోదు. రాష్ట్ర ఏర్పాటు ఆలసత్వంపై కాంగ్రెస్ చేసిన తప్పులు వారిని వెంటాడుతూనే ఉంటాయి. వారి చేతులకు అంటిన రక్తం మరకలు వెంటాడుతూనే ఉంటాయి' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. 'తెలంగాణ అమరవీరుల తల్లుల కడుపుకోతపై చిదంబరం కారం చల్లినట్టు ఉన్నది. అమరుల తల్లుల శోకం కాంగ్రెస్‌కు శాపంగా మారుతుంది. జలియన్‌వాలాబాగ్‌లో వెయ్యి మందిని కాల్చిచంపిన డయ్యర్ క్షమాపణ చెప్తే ఎట్లా ఉంటుందో.. చిదంబరం సారీ చెప్పినా అట్లనే ఉన్నది. కాంగ్రెస్ నాయకులను ప్రజాకోర్టులో నిలబెట్టి అమరవీరుల తల్లిదండ్రులు కొరడాతో కొట్టినా తక్కువే' అని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. 'గ్యారెంటీలకు గాంధీలు.. క్షమాపణలకు బంట్రోతులా? ఆరు దబాబ్దాలపాటు తెలంగాణను మోసం చేసిన గాంధీలు కనీసం స్వయంగా ప్రజలకు క్షమాపణ చెప్పలేరా? పదేండ్లలో ఒక్కసారి మీ కుటుంబానికి వందల మంది తల్లుల కడుపుకోత గుర్తుకు రాకపోవడం బాధాకరం. సోనియా, రాహుల్‌గాంధీలు తెలంగాణ అమరవీరుల స్తూపానికి నమస్కరించినా/ నివాళులర్పించినా వారి పాపాలకు విముక్తి లభించదు' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని 'కాంగ్రెస్ వేసిన భిక్ష'గా పేర్కొంటూ కాంగ్రెస్ నేతలు అవమానించడంపై నెటిజన్లు సైతం మండిపడ్డారు. ఉద్యమ బలిదానాలకు కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేదన్న వాదనలపైనా నిప్పులు చెరిగారు. శుక్రవారం ట్విట్టర్‌లో 'కాంగ్రెస్ మర్డరర్స్' హ్యాష్‌ట్యాగ్‌తో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. కొంత సేపు ఈ హ్యాష్‌ట్యాగ్ దేశంలోనే టాప్ ట్రెండింగ్‌గా నిలిచింది.

## కాంగ్రెస్‌తోనే ఉద్యమకారుల బలిదానాలు

- ఆ పార్టీని చిత్తుగా ఓడించాలి
- ఓయూ విద్యార్థుల ఆందోళన



గన్‌పార్కు వద్ద ధర్నా చేస్తున్న ఓయూ విద్యార్థులు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 17: వందల మంది ఉద్యమకారులను బలితీసుకున్న కాంగ్రెస్ పార్టీని ఓడించాలని ఉస్మానియా (ఓయూ) విద్యార్థులు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద విద్యార్థులు ఆందోళన చేశారు. రాహుల్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఓయూ విద్యార్థులు అరవింద్, సంతోష్, యాదగిరి, రాజ్‌కుమార్, అమరేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన ఉద్యమంలో వందల మంది ఆత్మహత్యలకు కాంగ్రెస్సే కారణమని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించడంలో ఆలస్యం చేసి వందల మందిని పొట్టనబెట్టుకున్న ఆ పార్టీకి తెలంగాణలో ఓట్లు అడిగే హక్కులేదని మండిపడ్డారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువతను బలితీసుకున్న కాంగ్రెస్ తెలంగాణ పాలిట భూతం వంటిదని విరుచుకుపడ్డారు. తెలంగాణలో అడుగుపెడుతున్న రాహుల్.. అమరుల చావులకు క్షమాపణ చెప్పి ముక్కునేలకు రాయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతల హామీలు అమలుకు నోచుకోనివని, ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని కోరారు. సుస్థిర పాలనను అందిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని కొనసాగించేలా ప్రజలు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు.